నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 11 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

## రైల్వే బోర్డు చైర్మన్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ

### జిల్లాలోని పలు రైల్వే సమస్యలపై వినతి

ఖమ్మం, మార్చి 10 : ఢిల్లీలోని రైల్ నిలయంలో రైల్వే బోర్డు చైర్మన్ సతీశ్‌కుమార్‌తో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి పలు రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, కొత్త ప్లాట్‌ఫాంల నిర్మాణం, కొవిడ్‌కు ముందు రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ, అదనపు హాల్టింగ్, కొత్త రైళ్ల మంజూరు వంటి అంశాలపై బోర్డు చైర్మన్‌తో చర్చించారు. ఎంపీ రవిచంద్ర ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై రవిచంద్ర బోర్డు చైర్మన్‌కు విజ్ఞాపన రూపంలో అందజేశారు.


రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు

## రైతుల సమస్యలు పరిష్కరించండి..

### కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్

ఖమ్మం, మార్చి 10 : జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కోరారు. ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కలెక్టరేట్‌లో సోమవారం ఎమ్మెల్సీ తాతా మధును కలిసి తమ సమస్యలు వివరించగా.. ఆయన రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిసి వివరించారు. రైతులు కూడా తమ సమస్యలను కలెక్టర్‌కు నేరుగా చెప్పుకున్నారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ తాతా మధుకు హామీ ఇచ్చారు. తాతా మధు వెంట రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, రైతులు ఉన్నారు.


కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యలు వివరిస్తున్న తాతా మధు

## వినతులను త్వరితగతిన పరిష్కరించండి

### ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, మార్చి 10 : ప్రజలు తమ సమస్యలపై చేసుకున్న వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల ప్రజావాణికి వచ్చి దరఖాస్తులు సమర్పిస్తున్నందున వాటికి అత్యంత ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలని సూచించారు. కాగా.. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన బేతిని అప్పారావు, రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, సింగరేణి మండలానికి చెందిన సయ్యద్ చాంద్ పాషా తదితరులు తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ అధికారులు తదితరులుపాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### ప్రజావాణిలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్


విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం టౌన్, మార్చి 10 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పరిష్కారం కోసం పంపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

### గిరిజన దర్బార్‌లో పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 10 : గిరిజనులు తమ సమస్యలపై సమర్పించిన అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీవో దరఖాస్తులు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించి, మిగిలిన వాటిని సంబంధిత శాఖ అధికారులకు పరిష్కారం కోసం పంపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల కోసం రుణాలు, పట్టా భూములకు రైతు బంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం, ట్రైకార్ సబ్సిడీ రుణాలు తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, ఏవో సున్నం రాంబాబు, ఎస్వో భాస్కరన్, ఏపీవో పవర్ వేణు, ఆర్వోఎఫ్ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, డీఎస్వో ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో రాహుల్

## ఏఐతో బోధన విద్యార్థులకు వరం

### భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్


తరగతి గదులను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బూర్గంపహాడ్, మార్చి 10 : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు)తో బోధన విద్యార్థులకు వరంగా మారిందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. అంజనాపురం ఎంపీపీఎస్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో బోధనా తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన మరింత ఆకర్షణీయంగా, ఇంట్రాక్టివ్‌గా నిర్వహించడానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెరుగ్గా సహకరిస్తుందన్నారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ చిన్నారులకు ఉత్సాహమే ప్రేరణగా ఆధారిత విద్యా బోధనను జిల్లాలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి కంప్యూట్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంజనాపురం, మోరంపల్లి బంజర్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక గాంధీనగర్ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం బూర్గంపహాడ్ ఆశ్రమ పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా బోధన, మెనూ అమలుపై ఆరా తీశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మోరంపల్లి బంజర్‌లో నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి వేపలగడ్డలో భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రాంనరేశ్, ఎంఈవో యదుసింహరాజు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## ఇంటర్ మూల్యాంకనం షురూ..

### తొలిరోజు సంస్కృతం సమాధాన పత్రాల వాల్యుయేషన్

ఖమ్మం అర్బన్, మార్చి 10 : ఖమ్మం నగరంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 5వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కాగా.. పూర్తయిన సమాధాన పత్రాలు మూల్యాంకన కేంద్రాలకు ఎప్పటికప్పుడు చేరుతున్నాయి. జిల్లా క్యాంపునకు ఇతర జిల్లాలకు చెందిన సమాధాన పత్రాలు వస్తున్నాయి. సోమవారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా మూల్యాంకనం జరుగుతుండగా.. సంస్కృతం సమాధాన పత్రాలను వాల్యుయేషన్ చేశారు. 29 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్‌ను కేటాయించగా.. తొలిరోజు 27 మంది రిపోర్ట్ చేసినట్లు క్యాంప్ ఆఫీసర్, డీఐఈవో రవిబాబు తెలిపారు.

### ఇంటర్ కేంద్రాల్లో గోడ గడియారాలు..

ఇంటర్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో విద్యార్థులకు చేతి వాచీలను కూడా అనుమతించకపోవడంతో సమయం తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో పలువురు ఇంటర్ బోర్డుకు విజ్ఞప్తి చేయడంతో సోమవారం ఇంటర్ బోర్డు గోడ గడియారాలను కేంద్రాల్లో అమర్చినట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇంగ్లిష్ పరీక్ష రాశారు. పరీక్షల్లో 17,078 మందికి 16,680 మంది హాజరై 398 మంది గైర్హాజరయ్యారు.

# పైలెట్‌కేదీ భరోసా?



లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామంలో రైతు భరోసారాని పోడురైతులు

- లబ్ధిదారుల్లో 40 శాతం మందికి అందని 'పంటల పెట్టుబడి సాయం'
- 'భద్రాద్రి'లో ఇంకా మూడువేల మందికి జమకాని 'రైతుభరోసా'
- 22 వేల మంది రైతులకుగాను 19 వేల మంది రైతులకు జమ
- 'ఖమ్మం'లో 20,802 మందికి అందాల్సిన మొత్తం రూ.28 కోట్లు
- కొత్తగూడెం జిల్లాలో పోడు పట్టాల భూములకు దక్కని 'పెట్టుబడి'
- ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- కాంగ్రెస్ సర్కారు మోసంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

**కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి. 'పేరు గొప్ప ఊరు దిబ్బ..' అనే సామెత మాదిరిగా రేవంత్ సర్కారు వ్యవహార శైలి ఉంది. ఆర్భాటాలు, అబద్ధపు ప్రకటనలు తప్ప.. క్షేత్రస్థాయిలో ఆచరణ ఇసుమంతైనా కన్పించడం లేదు. పైలెట్ గ్రామాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పన రైతుభరోసాను జమ చేశామంటూ ప్రభుత్వం నుంచి ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని పైలెట్ గ్రామాల్లోనూ క్షేత్ర పరిశీలన చేపట్టింది. దీంతో అసలు విషయం వెల్లడైంది. ప్రభుత్వం చెబుతున్నవి కేవలం అబద్ధాలేనని, ఇంకా 40 శాతం మందికి రైతుభరోసా అందాల్సి ఉందని తేటతెల్లమైంది. భద్రాద్రి జిల్లాలోని పైలెట్ గ్రామాల్లో మొత్తం 22 వేల మంది రైతులకు రైతుభరోసా కింద పంటల పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా 19 వేల మందికి సాయం జమ అయింది. ఇంకా మూడు వేల మందికి అందాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో కూడా ఇంకా 20,802 మంది రైతులకు మొత్తం రూ.28.42 కోట్లు జమ కావాల్సి ఉంది.**

–ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, మార్చి 10

కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే తప్ప చేతలకు సరిపోదని మరోమారు నిరూపితమైంది. పైలెట్ గ్రామాల్లోని రైతులకు జనవరి 26న గణతంత్ర దినోత్సవం నాడు తాజా సీజన్ కోసం ఒక్కో ఎకరానికి రూ.6 వేల చొప్పున జమ చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. అప్పటి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులందరూ 26న, ఆ మరుసటి రోజున తమ సెల్‌ఫోన్లు చేతపట్టుకొని కూర్చున్నారు. ఎంతసేపు వేచి చూసినా చాలా రోజుల వరకూ రైతుభరోసా నగదు తమ ఖాతాల్లో జమ కాలేదు. తరువాతి రోజుల్లో ఎకరం లోపు నుంచి మొదలు పెట్టి విడతల వారీగా జమ చేస్తూ వచ్చింది. అయితే సుమారు మూడు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకూ 40 శాతం మందికి మాత్రమే ఈ పంటల పెట్టుబడి సాయం జమ కావడం గమనార్హం. పైలెట్ గ్రామాలేగాక మిగిలిన గ్రామాల్లోనూ ఇంతకంటే దయనీయమైన పరిస్థితే నెలకొంది. ఆ గ్రామాల్లో కూడా కేవలం మూడు ఎకరాలలోపు విస్తీర్ణం కలిగిన రైతులకే రైతుభరోసాను జమచేసింది. అదీ కూడా సగం మందికే కావడం విశేషం. దీంతో అన్నదాతలందరూ కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుభరోసా నగదు తమకు ఇంకెప్పుడు జమ అవుతాయో తెలుసుకునేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### ఖమ్మంలో 21 పైలెట్ గ్రామాలు..

ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో 21 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేశారు. వీటిల్లో రైతుభరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున 20,802 మంది రైతులకు గాను 47,374.28 ఎకరాలకు రూ.28.42 కోట్లు జమ చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా కొన్ని పైలెట్ గ్రామాలను పరిశీలిస్తే ఇంకా చాలామంది రైతులకు పంటల పెట్టుబడి సాయం అందలేదనే విషయం స్పష్టమవుతోంది. ఖమ్మం రూరల్ మండలం పైలెట్ గ్రామమైన ఆరెంపులలో 614 మంది రైతులకుగాను ఇంకా 14 మంది రైతులకు రైతుభరోసా జమ కాలేదు. వైరా మండలం పుణ్యపురంలో ఇంకా 19 మంది రైతులకు రైతు భరోసా జమ కావాల్సి ఉంది. బోనకల్లు మండలం గార్లపాడులో 589 మంది రైతులకుగాను ఇంకా 30 మంది రైతులకు రైతుభరోసా అందలేదు. ఇక కూసుమంచి రెవెన్యూ పరిధిలో మొత్తం 3,187 మంది రైతులకు గాను ఇంకా 168 మంది రైతులకు జమ కాలేదు.

### భద్రాద్రిలో ఇంకా మూడు వేల మందికి..

పైలెట్ గ్రామాల్లోని రైతులకు అందాల్సిన రైతుభరోసా విషయంలో భద్రాద్రి జిల్లాలోనూ అదేతీరు కన్పిస్తోంది. ఈ జిల్లాలో 23 పైలెట్ గ్రామాల్లో 22 వేల మంది రైతులకు రైతు భరోసా జమ చేయాల్సి ఉంది. కానీ ఇంకా మూడు వేల మంది రైతులకుపైగా రైతుభరోసా జమ కాలేదు. అదే విధంగా పైలెట్ గ్రామాలను మినహాయించి పరిశీలించినా అదే విషయం స్పష్టమవుతోంది. ఇప్పటి వరకూ 3 ఎకరాల్లోపు విస్తీర్ణం ఉన్న రైతులకు కూడా పూర్తిస్థాయి పంటల సాయం అందలేదు. 3 ఎకరాలకు పైగా ఉన్న రైతులకు అసలే అందలేదు. వీరిలో ఈ జిల్లాలో మొత్తం 1,87,000 మంది రైతులు ఉన్నారు. ఇందులో 1,07,094 మంది రైతులకు రైతుభరోసా జమ చేశారు. ఇంకా 79,906 మందికి జమ చేయాల్సి ఉంది.

అయితే, పైలెట్ గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి నాలుగు పథకాల్లో భాగంగా రైతుభరోసా కూడా అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ.. ఆయా గ్రామాల్లో పోడు పట్టాలున్న రైతులకు మాత్రం భరోసా అందలేదు. కేవలం రెవెన్యూ పట్టాలు ఉన్న భూములకు మాత్రమే రైతుభరోసా జమ చేశారు. వీటిల్లో పైలెట్ గ్రామాల వారీగా పరిశీలిస్తే.. లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల, మైలారం గ్రామాల్లో 801 మంది రైతు

### పోడు పట్టాలకు దక్కని భరోసా..

లుండగా వారిలో 484 మంది రైతులకు భరోసా ఇచ్చారు. ఇంకా 314 మందికి అందలేదు. టేకులపల్లి మండలం బేతంపూడిలో 7,863 మంది రైతులకుగాను 5,637 మంది రైతులకే పంటల పెట్టుబడి అందింది. ఇంకా 2,026 మందికి అందాలి. ఇల్లెందులో 1,550 మంది రైతుల్లో 44 మంది రైతులకు భరోసా అందలేదు. సుజాతనగర్ మండలంలో 2,430 మంది రైతులకుగాను ఇంకా 345 మంది రైతులకు సర్కారు మొండిచేయి చూపింది. అశ్వారావుపేట మండలం పాతరెడ్డిగూడెంలో 1,753 మంది రైతులకు గాను ఇంకా 136 మందికి అందలేదు. ఇక గుండాల, ఆళ్లపల్లి, పినపాక, చర్ల మండలాల్లో పోడు రైతులకు రైతుభరోసా జమ కాలేదు. దీంతో ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మూడు దఫాలుగా రైతు భరోసా రాలే..



మాది పాలేరు. నాకు ఎర్రగడ్డతండాలో నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. నాకు గడిచిన మూడు దఫాలుగా రైతు భరోసా డబ్బులు రాలేదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి సీజన్‌లోనూ రైతుబంధు కింద పంటల పెట్టుబడి సాయం అందేది. కాంగ్రెస్ వచ్చాక గడిచిన వానకాలం, యాసంగి, ప్రస్తుత వానకాలం సీజన్ల డబ్బులు పడలేదు. మా దగ్గర కొంత మందికి డబ్బులు పడ్డాయి. కాంగ్రెస్ రాగానే ఎకరాకు రూ.15 వేలు వేస్తామన్నారు. కానీ, ఎకరానికి రూ.12 వేలు మాత్రమే ప్రకటించారు.

–బానోతు వెంకట్రామ్, రైతు, పాలేరు

### ఇప్పటికీ బ్యాంకులో వేయలేదు..



రైతుభరోసాను రూ.12 వేలకు పెంచామని, మొన్న రూ.6 వేల చొప్పున బ్యాంకులో వేశామని ప్రభుత్వం ప్రకటనలు చేసింది. కానీ మాకు మాత్రం ఇప్పటికీ రైతు భరోసా జమ కాలేదు. అసలు మాకు ఎంత పెరిగిందో కూడా నాకు తెలియదు. 20 కిలోమీటర్లు ప్రయాణించి బ్యాంకుకు వెళ్లి అడిగితే పంటల పెట్టుబడి జమ కాలేదని చెప్పారు. అందరికీ రైతుభరోసా నగదు జమ అవుతుందని గ్రామసభ రోజు చెప్పారు. మాకింకా పడలేదు.

–కేలోత్ లక్ష్మణ్, మైలారం, లక్ష్మీదేవిపల్లి

### రైతు భరోసా రాలేదు..



నాకున్న 2 ఎకరాల 10 గుంటలకు రైతు భరోసా ఇంకా పడలేదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఎన్నో వాగ్దానాలు ఇచ్చినా ఒక్కటి కూడా సరిగ్గా అమలు చేయడం లేదు. అధికారులు, కాంగ్రెస్ నేతలు చెప్పే మాటలకు పొంతన లేకుండా ఉంది. పంటల సాగు కోసం పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నాం. తిరిగి ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గరికి పెట్టుబడి కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు భరోసా అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

–కొమరం నాగేశ్వరరావు, రేగళ్ల, కరకగూడెం మండలం

### కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంకా అందలేదు..



మాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పత్తి పంట సాగు చేస్తున్నాం. గత కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడే మాకు రైతుబంధు అందింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇంకా రైతుభరోసా అందలేదు. అధికారులను అడిగితే వస్తుందంటూ సమాధానం చెబుతున్నారు. కానీ ఇంకా అందడం లేదు. పంటల పెట్టుబడి కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

–యాట్ల లక్ష్మి, మహిళా రైతు, పాతరెడ్డిగూడెం, అశ్వారావుపేట

## ఓటీపీ వస్తేనే గ్రూప్-1 ఫలితం!

- మార్కులు తెలుసుకునేందుకు శ్రమించిన అభ్యర్థులు
- రీ కౌంటింగ్‌కు అవకాశం కల్పించిన టీఎస్‌పీఎస్సీ
- జీఆర్ఎల్ లేకపోవడంతో అభ్యర్థుల్లో అసంతృప్తి

ఖమ్మం అర్బన్, మార్చి 10 : రాష్ట్రంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలైన నేపథ్యంలో తమ మార్కులు తెలుసుకునేందుకు అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అధికారులు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి అభ్యర్థుల మార్కులను అందుబాటులో ఉంచగా.. తమ మార్కులు కనిపించాలంటే మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేయాలి. అయితే చాలా మంది అభ్యర్థులు ఎన్నిసార్లు ప్రయత్నించినా వారి ఫోన్లకు ఓటీపీ రాలేదు. సుమారు గంట తర్వాత ఓటీపీలు రావడంతో ఫలితాలు చూసుకున్నారు. మొత్తం ఏడు సబ్జెక్టుల్లో పరీక్ష జరగ్గా ఇంగ్లిష్ అర్హత పేపర్ మాత్రమే కాగా.. మిగిలిన ఆరు పేపర్లలో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుని కటాఫ్ నిర్ణయించే అవకాశం ఉంది.

### రీ కౌంటింగ్‌కు అవకాశం

గ్రూప్–1 మెయిన్స్ మార్కులను మాత్రమే వెల్లడించిన టీఎస్‌పీఎస్సీ రీ కౌంటింగ్‌కు అవకాశం కల్పించింది. రూ.వెయ్యితో ఒక సబ్జెక్ట్‌కు చొప్పున చెల్లించాలని స్పష్టం చేసింది. గ్రూప్–1 పోస్టుల భర్తీని మల్టీజోన్ల వారీగా భర్తీ చేయనుండడంతో అభ్యర్థులు తమ మార్కుల ఆధారంగా వారి కేటగిరీలలో ఎన్ని మార్కులు ఎక్కువ వచ్చాయని తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు మల్టీ జోన్–1 పరిధిలోకి రానున్నాయి.

### జీఆర్ఎల్ లేకపోవడంతో...

గ్రూప్–1 మెయిన్స్ మార్కులు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్(జీఆర్ఎల్) విడుదల చేయలేదు. కొంత మందికి 370కిపైగా మార్కులు రాగా, మరికొందరికి 410కిపైగా మార్కులు వచ్చిన అభ్యర్థులు జిల్లాలో ఉన్నట్లు తెలుస్తుంది. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా, హైదరాబాద్‌లో ఉండి శిక్షణ పొందిన ఖమ్మం అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 563 పోస్టులు రాష్ట్రస్థాయిలో ఉండగా.. మల్టీజోన్–1 పరిధిలో తమ మార్కులకు ఏ ర్యాంక్ వచ్చిందో తెలియక, ఉద్యోగావకాశాలు ఎంత వరకు ఉన్నాయో స్పష్టత లేక గందరగోళంలో అభ్యర్థులు ఉన్నారు. మార్కులు ప్రకటించినప్పటికి జీఆర్ఎల్ తెలియకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. తమకు తెలిసిన మిత్రుల ద్వారా, శిక్షణ పొందిన ఇనిస్టిట్యూట్‌ల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేసినప్పటికి ఎవరికి అవకాశాలు ఉన్నాయనే దానిపై ఒక అంచనాకు రాలేకపోతున్నారు.